ఆర్థికంగా దోచుకోబడుతున్నది
శ్రామికుడైతే
అన్ని విధాలా దోపిడీకి గురి అవుతున్నది
స్త్రీ!
అవును
తల్లిగా, సోదరిగా, భార్యగా-

# స్త్రీ

## 'మొపాసా'

పురుషునికి జీవితాన్ని, సౌకర్యాన్ని, సుఖాన్ని అందించేందుకు

తన బ్రతుకును వినియోగిస్తున్న ఆమె

బదులుగా ఏమి పొందగల్గుతున్నది? అంటే

జవాబు చాలా అసంతృప్తికరమైనది!

* * *

స్కూలు ఫైనల్ పాసవటంతో ఆరంభమైంది కథ!

కథకి ఆరంభం కాదు!

అవగాహనా శక్తికి, తనకు జరుగుతున్న అన్యాయాన్ని గుర్తించే స్థాయికి

అనుకున్నట్టు పరీక్ష ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణురాలయినందుకు ఎంతో ఆనందాన్ని పొందిన రాజేశ్వరి, ఇంకా పైకి చదువుకోవాలని వున్నదనే కోరికని తెలిపే లోపే-

'ఇంకా చదివించ'నవే నిర్ణయాన్ని-

"ఆడపిల్లకు చదువెందుకు?" అన్న ఖరారైన ప్రశ్నతో తేల్చివేశాడు తండ్రి

"అంతే ఉద్యోగం చేయాలా? ఊళ్ళేలాలా? ఎలాగూ ఒకరితో ముడిపడాల్సిందే కదా ఎప్పటికైనా!" తల్లి కూడా ఆయనకి డిటో!

సాంప్రదాయం అవిడ్ని భర్తకు వ్యతిరేకంగా, స్వతంత్రంగా ఆలోచన చేయనివ్వదు

"నేను ఇంకా చదువుకుంటానమ్మా!"

అంటూ రాజేశ్వరి తల్లి దగ్గర హఠం చేయ లేదు. పంతానికి పోయి కోరికను నెగ్గించుకునే ప్రసక్తి అనేదే లేదు

అందుకే- అర్థించింది.

"ఆయన చదివించనంటున్నారు కదే?"

తల్లి ప్రశ్న ఆమెను మౌనం వహించేట్లు చేసింది

"నువు నాన్నని ఒప్పించమ్మా" అంటే,

"నామాట వినిపించుకుంటారా? అదెప్పుడైనా జరిగిందా?" అన్న ప్రశ్న సమాధానమవుతుంది.

విరుద్ధమైన ఫలితాన్ని వూహించి కూడా ప్రయత్నించేవాళ్ళు ఆశావాది అయితే, రాజేశ్వరిలో ఆ ఆశావాదం లేదు

కోరికను మౌనంగా దిగమ్రింగటం ఆమెకు తెల్సిందే!

అనుభవం అలవాటుగా మారుస్తుంది.

"చదువుకోకుండా ఏం చేస్తావురా?"

అదే తండ్రి చదువుకోనంటున్న దామోదరాన్ని గదమాయిస్తున్నాడు

దామోదరం రాజేశ్వరికి అన్నయ్య. రెండేళ్ళు పెద్ద

స్కూల్ ఫైనల్‌లో రెండేళ్ళు వుండి చివరికి రాజేశ్వరితోటి పాసయ్యాడు- ఉత్తేసరు మార్కులతో

"బిజినెస్ చేస్తాను"

"బిజినెస్సా?"

"అవును. ఏం?"

"ఏడ్చినట్టే వుంది ఆలోచన".

"చదివినా ఉద్యోగం రాలేదన్న ఏడుపు కంటే ఏమీ మిగలదు"

"అయితే చదువుకోనంటావ్?"

"మళ్ళీమళ్ళీ చెప్పాలా?"

"ఏడువ్" అనేసి వెళ్ళిపోయాడు గానీ తర్వాత తనే రాజీ పడ్డాడు తండ్రి.

కొడుకు పంతం ముందు ఆయన పట్టుదల వీగిపోయింది

రాజేశ్వరి నిర్లిప్తంగా గమనించటం మినహా ఏం చేయలేక పోయింది.

తల్లికి ఇంటి పనులలో సాయపడటం తోటి వాళ్ళతో కబుర్లు. ఏదో విధంగా కాలహరణం చేయటంతో రోజులు గడిచిపోతున్నాయి.

పెళ్ళి సంబంధాలు చూడటం ఆరంభమైంది.

ఈడేరిన ఆడపిల్లను చూస్తే సహజంగా తల్లిదండ్రులకు ఎప్పుడే ఆదుర్దానే

ఒక్కొక్క పెళ్ళికొడుకు రావటం, రాజేశ్వరి అయిష్టంగా వాళ్ళకు ఆకర్షణీయంగా కన్పించే విధంగా ముస్తాబు అవటం, టిఫిన్ కాఫీలు ఫలహారా ఆరగించి, శల్యపరీక్ష కానిచ్చి, నచ్చలేదన్న మాటతో ఆమె మనసును గాయపర్చటం-

నిజానికి నచ్చనిది కట్నం, లాంఛనాలు!

ఆఖరికి ఒక సంబంధం-

వాళ్ళకు అంతవరకూ చూసిన వాటికంటే మెరుగుగా అన్పించి వుంటుంది. అయినా వీళ్ళిస్తానంటున్న కట్నం రాబట్టుకోవాలనే ఆరాటం!


వీళ్ళిచ్చే కట్నం కంటే మరో రెండువేలు ఎక్కువ కావాలని బేరం పెట్టారు

ఆడపిల్ల తండ్రి! ఇచ్చుకోక ఏం చేస్తాడనే ధీమా!

అప్పటికి ఇస్తామన్నదే తాహతుకి మించింది. ఏదో ఆ మూడుముళ్ళూ పడితే ఒక్కగానొక్క ఆడపిల్ల బాధ్యత తీరిపోతుంది గదా అన్న భావంతో తెగించారు. ఇప్పుడూ సందేహించలేదు. పెళ్ళి కొడుకేమి తక్కువవాడు కాదుకదా! బాంక్‌లో వుద్యోగం. పిల్ల సుఖపడుతుంది. మరో రెండువేలు ఎక్కువైతేనేం?

ఆ బేరసారాల ధోరణికి రాజేశ్వరి మనసు

**అప్పులు చేసి ఎలాగైతేనేం రాజేశ్వరి పెళ్ళి చేసారు. భర్త ఉద్యోగరీత్యా వేరే వూళ్ళో వుండడంతో అత్తా ఆడబడుచులు వున్నా వాళ్ళ పోరు తప్పింది. కానీ అప్పుడు తెలిసింది ఏ భార్యా సహించలేని కొత్త విషయం....!?**



ఆగ్రహంతో జ్వలించింది

"వద్దని చెబుదామంటే-తన అభిప్రాయానికి ఆమాత్రం విలువకూడానా? ఇంతవరకూ ఆ సంబంధంపై తన ఇష్టాయిష్టాల ప్రసక్తే రాలేదు

అప్పులు చేసి. ఎలాగైతేనేం ఆడంబరంగా పెళ్ళి పూర్తిచేశారు

భర్త ఉద్యోగరీత్యా వేరే వూళ్ళో కాపురం అవటంతో-అత్తా ఆడబిడ్డలపోరు-వాళ్ళు ఉన్నా లేకపోవటం కొంత వరకూ నయం!

కానీ ఆ జీవితం మేడిపండు సామెత అని కొంత కాలానికి గ్రహించింది.

ఏభార్యా సహించలేని విషయం - భర్తకు మరొక స్త్రీతోటి సంబంధం

అతనికి ఏ అవలక్షణాలు వున్నట్టు తెల్సినా రాజీ పడిపోతుంది-తప్పనిసరై.

తాగుడులాంటి వ్యసనాలకి ఎలాగో సరిపెట్టుకుంటోంది పేకాట వంటి జూదరి గుణాలకి కూడా సర్దుకుపోగలదు

కానీ మరో స్త్రీతో సంబంధం-తెలియనంత కాలమూ ఫర్వాలేదు

తెలిస్తే మూకమా-సంఘర్షణ లేకుండా వుండటం జరిగని పని!

భర్త గురించి తెల్సి-"ఎవత్తె అది?" తీరుగా అడిగింది రాజేశ్వరి

ముందుగా నిర్ణయించుకోయినా, మరుక్షణంలోనే అతనిలో మగ అహంకారం మేల్కొంది

"నా కొలీగ్. ఇంకేమైనా వివరాలుకావాలా?" అన్నాడు సరకు చేయనట్టు

"ఎన్నాళ్ళనుంచి పరిచయం?"

"ఆ వివరాలెందుకు? ఇకముందు కూడా కొన సాగుతుందని మాత్రం తెల్సుకో"

"నాకన్నా అందంగా వుంటుందా?"

భర్త మరొక స్త్రీకి ఆకర్షితుడయ్యాడంటే, ఆడది సహజంగా ఈ విషయంలోనే అనుమానంతో అవమానించినట్టు ఫీలవుతుంది

"చాలా! చూస్తావేమిటి?" వెటకారంగా నవ్వాడు

రాజేశ్వరి మనసు ఆగ్రహంతో జ్వలించింది.

"నేను కూడా అదే చేస్తే?"

"అంటే?"

"మీకన్నా అందగాడితో..."

"ఎంత పొగరే?" మాట మధ్యలోనే ఆమె చెంప ఛెళ్ళుమంది.

"వేధవ్వేషాలేశావంటే మెకపట్టి బైటకు గెంటు తాను నోరు మూసుకుని ఒక మూల పడి వుండు ఎలా కన్పిస్తున్నానేమిటి?" అన్నాడు క్రౌర్యంగా చూస్తూ

కళ్ళల్లో కన్నీరు సుడులు తిరుగుతుంటే, అవాక్కుగా చూస్తూండిపోయింది

వెంటనే పుట్టింటికి ప్రయాణమైంది.

అయితే రాజేశ్వరికి అక్కడ ఆశించిన ఓదార్పు లభించలేదు అంతా ఆమె చెప్పగా విని-

"సర్దుకుపోవా లమ్మా" అని తల్లి సలహా

"మగాడికి సవాలక్ష వ్యవహారాలుంటాయి. అవన్నీ పట్టించుకుంటే ఎలా?"

భర్తనుంచి విడిపోతే తల్లిదండ్రులు అనంతరం భారం తనపై పడుతుందనే ముందు చూపుతో సాహోదరం వ్యాఖ్యానం.

"నీ పెళ్ళికి చేసిన అప్పు ఇంకా తీరలేదు అప్పుడే అతనితో తెగతెంపులు చేసుకుంటావా? ఏవేమైనా ఆషామాషీ వ్యవహారమనుకున్నావా? నేను అతనికి చెబుతాను" అంటూ తండ్రి వెంట బెట్టుకు తీసుకువెళ్ళాడు తిరిగి భర్త దగ్గరికి.

ప్రతిఘటన పనికిరాదని గ్రహించిన తనకు, తన మనసును సర్దేసుకోవటం తప్పనిసరైంది.

ఏం చేస్తుంది?

అప్పటికి. మామగారికి ఏం మాటలు జరిగాయో భర్త మౌనంగా తన రాకను ఆమోదించాడు

కాని అతని ప్రవర్తనలో ఆశించిన మార్పేం లేదు

ప్రశ్నిస్తే- "పుట్టింట్లో వెలగబెట్టి వాపసు తయారైన దానివి, ఏ ముఖం పెట్టుకుని తిరిగొచ్చావ్? గతి లేకని తెల్సుకున్నావ్ కదా? దిక్కు లేదని అర్థమైపోయిన దానివి ఇక నోర్మూసుకుని పడి వుండు" అన్న కటువైన మాటలతో తనను మూగదాన్ని చేసేవాడు

నిస్పృహతో ఆత్మహత్య చేసుకోవాలనుకున్న రాజేశ్వరిని అడ్డుకొంది కడుపులోని ప్రాణి!

బిడ్డ పుడితే భర్త కనీసం అప్పుడైనా మారడా అన్న ఆశ!

అయితే అది ఆశగానే వుండిపోయింది దాన్ని ఆరాధిస్తూ కొడుకు పెరిగాక తన ఈ కష్టాలన్నీ కడతేరి పోతాయనే సర్దుబాటు ధోరణి!

కొడుకు ఇరవైయేళ్ళ వాడయి డిగ్రీ తీసుకునే టప్పటికి భర్త మరణించాడు. అప్పుడు దుఃఖించటం తనకు ఆశ్చర్యమనిపిస్తుంది

అతనితో ఏం సుఖపడిందని ఆ కన్నీరు?

తనకు అతని అనురాగంలో భాగం లేకున్నా అతనితో జీవితంలో పాలు పంచుకుంది.

కారణం అర్థమైన రాజేశ్వరికి పెదిమలపై పేలవమైన నవ్వు!

స్త్రీ ఇంత సున్నిత మనస్క- బలహీనురాలు గనకనే ఆమె దుఃఖాన్ని మించి బావుకోటం లేదు అన్పించింది.

కొడుకు మెరిట్ చూసి, ఒక డబ్బున్న ఆసామి, మంచి కట్నం, లాంఛనాలతో తన కూతురినిచ్చి పెళ్ళిచేసి, అతనికి తన పలుకుబడితో హైదరాబాద్‌లో ఒక హోదాగల ఉద్యోగం వేయించటం రాజేశ్వరికేమీ అనంగీకారం కాలేదు

కాని అప్పటి కొడుకు ప్రతిపాదనే ఆమెకు-

వాడియైన బాకు గుండెల్లో దింపినట్టుగా.

ఘనవిజయం లభిస్తుందని భావించిన విషయంలో ఘోర పరాజయం పొందినట్టు-

ఆ ఆశాభంగం ఆమె మనసులోని జీవితేచ్ఛను కూకటివేళ్ళతో కూల్చి వేసింది.

"మాతో నువ్వు వద్దమ్మా. ఆ హైదరాబాద్‌లో వాతావరణమదీ నీకు సరిపడదు అంతేకాక ఇల్లు పెద్దది తీసుకోవాలంటే చాలా అద్దె పెట్టాలి స్వతంత్రంగా ఇక్కడ సొంత ఇంట్లో నీ కవసరమైనంత వుంచుకుని, మిగతాది అద్దెలకిచ్చి చూసుకుంటుంటే నీకు కాలం దొర్లిపోతుంది ఏమైనా డబ్బు అవసరమైనపుడు నాకు వ్రాస్తే పంపిస్తాను"

ఇదీ-సమస్త ఆశలను అతనిపై కేంద్రీకరించుకుని, జీవిత శేషాన్ని అతని నీడలో ప్రశాంతంగా ముగించుకోవచ్చనే భావనలో వున్న తన మనసుతో నిమిత్తం లేకుండా కొడుకు చేసిన నిర్ణయం!

కల్సి ఉండాలనుకున్న కోరికను బైట పెట్టలేకపోయింది-అది కొడుకు వద్దంటున్నాడు గనక!

అప్పుడు రాజేశ్వరికి అన్పించింది

అవును! ఆడదానికి ఏది

తండ్రి పెంపకంలో కోరుకున్న విద్యను, వ్యక్తిత్వాన్ని ఏర్పరుచుకుని పెరిగే అవకాశం-

యవ్వనంలో భర్త అనురాగం, ఆప్యాయతలతో సాగే మధురమైన జీవనం-

వృద్ధాప్యంలో కొడుకు రక్షణలో నిశ్చింతతో ముగిసిపోవాల్సిన బ్రతుకు-ఏమీ వద్దు

అసలు స్త్రీకి "జీవితం ఎందుకు?" ✱



## శ్రద్ధాంజలి

వేరువ పరమాత్మమ్మ

చీరాల

| నిర్యాణం | ఏడవ సంవత్సరీకం |
|---|---|
| 3-2-1977 | 15-2-1984 |
| | (తిథి : మాఘశుద్ధ చతుర్దశి) |

సాకార మూర్తివై మా మదిలోనిలిచి
నిరాకార మూర్తివై మా ఆత్మలో లీనమై
పరమాత్మవై నీవు విశ్వ వ్యాప్తమై
ఆరాధ్య దేవతగా నిన్ను మేమందుకొంటున్నామమ్మ

వేరువ సుబ్బారావు (భర్త) వేరువ లక్ష్మీకాంతం (మరిది) పెద్దబాబు, చిన్నబాబు, కృష్ణ (కుమారులు) కుమార్తెలు, అల్లుళ్ళు, కోడళ్ళు, మనుమలు, మనుమరాండ్రు.

